# కవి ప్రేయసి

## కె.బి.యస్. కుమార్

సౌందర్యని చూస్తే నేను పరవశిస్తాను. నన్ను చూస్తే సౌందర్య పరవశిస్తుంది. మమ్మల్నిద్దర్నీ చూస్తే ప్రకృతి పరవశిస్తుంది.

సౌందర్యలో—సౌందర్యమే పరవశించేంత సౌందర్యం వుంది.

ఆమాట నేను సౌందర్యతో అంటే ఆమె నవ్వి వూరుకుంటుంది. యిది నాకు కొత్తకాదు. ఆమెకీ కొత్తకాదు.

కొత్తకాక పోయినా ప్రతి సారీ కొత్తగా వుంటుంది.

...సౌందర్య నన్ను కుదపటంతో నేను వులిక్కి పడ్డాను.

"ఏమిటీ ఆలోచిస్తున్నారు?" నవ్వుతూ అంది.

..."అబ్బే—మనగురించే..." అన్నాను.

"మన గురించి—?" చిలిపి కళ్లురెపరెపలాడాయి.

"మన ప్రేమ గురించి..." అన్నాను నవ్వుతూ.

"ఏమాలోచిస్తున్నారు?"

"సౌందర్యా..." నెమ్మదిగా అన్నాను. "నేను ప్రేమ కథలు బోలెడు వ్రాశాను. కాని ఎప్పుడూ ప్రేమించాలను కోలేదు. కాని..."

నిజమే! నేను నిజంగా ఎవ్వర్నీ ప్రేమించాలనుకో లేదు. ప్రేమ కథలు సృష్టించి—అందులో బాధాకరమైన మలుపుల్ని సృష్టించి సుఖాంతమో దుఃఖాంతమో చేసే నేను—నా జీవిత భాగస్వామిని ఎన్నుకోవటంలో ప్రేమించి పెళ్లాడాలనుకోవడంలేదు. ఈ వుద్దేశం నాలో గత సంవత్సరం వరకూ వుండింది.

కాని సౌందర్య రూపంలో ఒక స్పందన వుంది. ఆమె ఆప్యాయతలో ఒక అందం వుంది. ఆమె చూపుల్లో ఒక బంధం వుంది. ఆమె నాకు పరిచయమయ్యాక ఒక నెల నుండి నేను క్రమంగా మారిపోవటం మొదలు పెట్టాను. నామునుపటి వుద్దేశ్యం నుండి—పారిపోవటం మొదలు పెట్టాను...

...గట్టిగా గిల్లింది సౌందర్య.

మళ్లీ వులిక్కిపడ్డాను.

"చూశారా! చెబుతున్నదేదో పూర్తి చెయ్యక ముందే ఆలోచనల్లో పడిపోయారు. మీ రచయితల్తో వచ్చిన చిక్కేయిది!!" అందంగా నుదురు కొట్టుకుంది సౌందర్య.

"యిలాంటప్పుడు నీకేమన్పిస్తుంది?" ఆమె వేపు చూస్తూ అన్నాను.

"ఏమీ అన్పించదు."

"వాట్!? నన్ను చూస్తే నీకేమీ అన్పించదా?" కొంటెగా ఆమె జడని దొరక బుచ్చుకున్నాను.

"మీలా చెప్పడానికి నేను కవయిత్రిని కాను బాబూ!"

"పోనీ నీ భాషలోనే చెప్పు..."

"ఏం చెప్పమంటారు? అనిర్వచనీయమైన అనుభూతుల్ని అందించే రచనలందిస్తోన్న మీ విలువైన చేతిని ప్రియంగా చూస్తూ మనసు నింపుకోవాలన్పిస్తోందనాలా? ఆ రచనల్లోని వాడియైన వేడి నా హృదయంలోంచి—వెచ్చని హృదయంలోంచి దూసుకు పోతూ చిత్రమైన దుమారం రేపుతోందనాలా? పదునైన భావాల్ని మనోహరంగా సృజించే మీ మస్తిష్కం ముందు వెల తెలాబోతోన్న నామస్తిష్కాన్ని తల్చుకుంటే సిగ్గేస్తోందనాలా? మీ..."

"ఆపు సౌందర్యా..." ప్రశాంతంగా అన్నాను. కాని ఆ ప్రశాంతత రాబోయే తుఫానుకి నాంది.

ఆగిపోయింది

"నిన్ను నువ్వు నిందించుకున్నా భరించలేను..."

"నన్నాపకండి మురళీ!! మీ సాన్నిధ్యం నాకు వేయి మురళి రవళుల సంగీతాన్నందజేస్తుంది. మీ పలుకులు విన్న నా వీనులు వేయి గోపికల నృత్యతరంగాల్ని చూసిన కన్నుల్లా పరవశిస్తాయి. మీ రచనల్ని చూసిన ఈ కన్నులు వెయ్యి సుందర దృశ్యాల్ని చూసిన మధురిమతో పులకరిస్తాయి..."

**నెల తరువాత తిరిగొచ్చిన నన్ను చూసి బావురుమంది సౌందర్య. నిజమే మన మొకటి తలుస్తే దైవ మొకటి తలుస్తాడు. అన్నీ మనం అనుకున్నట్టే జరగవు. అప్పుడప్పుడు ఇలాంటి పరీక్షలు ఎదురవుతుంటాయి.**

"ఎందుకు సౌందర్యా నాపై నీ కింత ప్రేమ?... రచయితననా?"

"మురళీ!!!" చటుక్కున నా నోరు మూసింది సౌందర్య. "ఇంతేనా మీరు నన్నర్థం చేసుకున్నది, ఈ సంవత్సర కాలంలో...?"

"అబ్బే—నువ్వు బుంగమూతి పెడితే చూడాలన్పించింది..." కొంటెగా అన్నాను.

సౌందర్య కన్నుల్లో కోటి సూర్యులు తొంగి చూశారు.

* * *

"నువ్వు తొందర పడుతున్నావేమో..." అన్నాడు బలరాం.

...బలరామ్ నాకంటే ఒక్క సంవత్సరం పెద్ద. అందుకని నేను వాణ్ని 'బ్రలామ్' అని పిలుస్తాను. ఒకోసారి ఒరే అనడం కూడ కద్దు.

మా తల్లిదండ్రులకి మేమిద్దరమే సంతానం. యిద్దరం డిగ్రీలు తీసుకునే సరికి మేమిద్దరమే మిగిలాం.

మాకుద్యోగాల్లేక పోయినా బతగ్గల సంపదని మిగిల్చి పోయారు నాన్న. అంచేత యిద్దరం కళారంగంలో కాళ్లుపెట్టాం.

వాడు సంగీతంలో రాటుదేలాడు. నేను రచయితగా పేరు తెచ్చుకున్నాను.

నేను రాసే పాటలకు వాడే సంగీతం సమకూరుస్తాడు. అంతేకాదు. వాడు చక్కగా పాడగలడు కూడా.

అలా కంబైండుగా బోల్డు పేరు తెచ్చుకున్నాం.

సౌందర్య ఓ పాఠకురాలిగా పరిచయమైంది.

దీపావళి నవలల పోటీలో నా 'వజ్రాల బొమ్మ ప్రథమ బహుమతి నందుకుంది. అది యింకా సీరియల్‌గా వస్తోనేవుంది. 'ఆంధ్రప్రియ'వారపత్రికలో.

అది చదూతోన్న సౌందర్య నన్ను—పాఠకురాలిగా ప్రశంసించి స్నేహితురాలై—ప్రియురాలై కూచుంది.

ఆమె తండ్రి ప్రసాదవర్మ—మల్టీ మిలియనీర్! ఆమెతో పోలిస్తే ఆర్థికంగా నేను ఎంతో వెనకబడి వున్నాను.

అయినా ఆమె లెక్క చెయ్యలేదు. నన్నేకోరుకుంటోంది.

ఆ విషయమే బ్రలామ్‌కి చెబితే వాడన్నాడీమాట, నువ్వుతొందర పడుతున్నావేమో అని.

"అవును మరి — సంవత్సరం నుండి ప్రేమిస్తున్నాను..."

నేనింకా ఏదో అనబోతూ ఆశ్చర్యంగా వాకేసి

చూస్తూ వుండిపోయిన వాడి మొహాన్ని చూస్తూండి పోయాను.

నెమ్మదిగా వాడి మొహం మామూలుగా మారి పోయింది.

"ఆలోచించు మనం ధనికులమే. కాని ఆమె మనని మించిన అంతస్తులో వుంది....."

"మేమిద్దరం యిప్పుడు ఒకే అంతస్తులో వున్నాం.."

బ్రలావ్ జవాబివ్వలేదు. వాడికి తెల్సు, నేను పట్టుపడితే విడవనని...

* * *

మొక్కల మీద పువ్వులు హీరోయిన్సులా వున్నాయి. తుమ్మెదలు విలన్సులా వచ్చి వాటిలోని మకరందాన్ని జుర్రేస్తున్నాయి. పువ్వులు మాత్రం వాటిని చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నాయి.

"నాకు భయంగా వుంది మురళీ" అంది సౌందర్య.

"ఎందుకు?"అన్నాను.

"మీరు నాకు దూరమవుతారేమోనని..."

"ఎంత దూరమైతే అంత దగ్గరవుతాను".

"అవి మీరాసే నవలల్లోని మాటలు..."

"అయితే యిందాక నువ్వన్న మాటలు నువ్వు చూసిన సినిమాల్లోవైవుండాలి.

"మీతో నేను మాట్లాళ్ళేను బాబూ!"

నిజం...ఒట్టు!!మూతి బిగిస్తే సౌందర్య మరింత అందంగా వుంటుంది.

"సరే...ఓ శుభవార్త చెపుతాను. ఏమిస్తావ్?"

"మనసే యిచ్చాను. ఇంకేం కావాలి?"

పెదవులపై వ్రేలుపెట్టి చూపించాను.

"ఛి...ఫో..."అంది చాలామంది ఆడపిల్లల్లాగే.

"నిజంగానే పోతున్నాను".

"ఎక్కడికి?"

"బెంగుళూరు దగ్గర పల్లె".

"కారణం?".

"ఏవో భూమి తగాదాలున్నాయట. బ్రలావ్ వెళ్లిరమ్మన్నాడు"

"యిదేనా శుభవార్త?"

"కాదు. బ్రలావ్‌కి చెప్పాను మన విషయం. నీయిష్టమన్నాడు.

"అంటే—?"

సౌందర్యకి చెప్పాను. నా పట్టు గురించి.

కీచుమని కేక పెట్టింది సౌందర్య.

అమితమైన సంతోషం కల్గినప్పుడు సౌందర్య అలా కేకపెడుతుంది.

* * *

నెల తరవాత తిరిగొచ్చిన నన్నుచూసి బావురుమంది



సౌందర్య.

నిజమే మన మొకటి తలుస్తే దైవమొకటి తలుస్తాడు. అన్నీ మన మనుకున్నట్టే జరగవు. మనిషి జీవితంలో అప్పుడప్పుడూ యిలాంటి పరీక్షలు ఎదురవుతూం టాయి. వాటిని ఎదుర్కోక తప్పదు.

అదే చెప్పాను సౌందర్యతో.

"ఏమిటండీ ఈ పరీక్ష, ఇదా దేవుడి పరీక్ష? చక్కని కలంతో చల్లని సాహితీ వెలుగులు పంచే మిమ్మల్ని చూసి ఆదేవుడికి కన్నుకుట్టింది కాబోలు, మీ కళ్ళు పెకిలించా డు." నాదోసిట్లో మొహం దాచుకుంది సౌందర్య.

"పోయింది కళ్ళేగాని కరం కాదుగా!? కలం సాగటానికి కళ్ళూకరాలూ అవసరంలేదు సౌందర్యా!మన సుంది. మస్తిష్కముంది. వాటి కవిటితనం వచ్చేవరకూ నేను గుడ్డివాణ్ణికాను. నా కలం నిరంతర సాహితీ వాహినే!! మనసు ప్రేరేపిస్తుంది. మస్తిష్కం ఆలో చిస్తుంది. అధరద్వయం పలుకుతుంది. నీ అందమైన కరం — కాగితంపై పరుస్తుంది,"

"అంత అదృష్టమా నాకు?!"

ఆమాటలంటున్నప్పుడు సౌందర్యమొహం చూడా లన్పించింది కాని.....

"ఏం సౌందర్యా...వ్రాయవా!?" అన్నాను మరో సారి ఆ స్పందనని అనుభవించాలనే తపనతో.

"అంత అదృష్టమా నాకు?"మళ్ళీ అంది సౌందర్య.

* * *

నిజంగా ఈ గుడ్డితనం ఎంత భారమైనది? ఎంత బాధాకరమైనది!!??

ఎందరో గుడ్డివాళ్లని రకరకాలుగా చిత్రిస్తూ ఎనెన్నో రచనలు చేశాను. వాళ్ళ బాధలూ ఆనందాలూ — కాల్పనిక జగత్తులో విహరిస్తూ అభివర్ణిస్తూ రాశాను. అభినందనల వర్షం కురిసింది పాఠకులనుండి.నిజంగా కళ్లు పోగొట్టుకొని అంధజీవితాన్ని అనుభవిస్తూ రాసినట్టు భ్రమింపజేసిన రచయితకు ధన్యవాదాలు అంటూ పాఠకులు నన్ను ఆకాశానికెత్తేశారు.

కాని గుడ్డితనంలో యింత బాధ వుందా?

...నేను చదవలేను గాబట్టి సౌందర్య వుత్తరాలు రాయటం మానేసింది. బలరామ్ సాయంతో వారాని కోసారి కల్సుకునే వాడిని. ఆశ్రమతప్పిస్తూ అప్పు డప్పుడూ ఆమే వచ్చి చూసిపోతోంది.

వూళ్లో అల్లర్లు జరుగుతోన్నందున తరచూ బయ టికి రావటానికి అభ్యంతరం తెలుపుతున్నార్ట వర్మగారు.

నిజమే — ఆడపిల్ల! జరక్కూడనిది జరిగితే ఏం కావాలి? నేను రక్షించే స్థితిలో లేను.

"...మురళీ! నీకు వుత్తరం వచ్చిందిరా!" అంటూ వచ్చాడు బలరామ్.

"ఏరా! వేళాకోళమా!?"

"...ఓహ్ — సారీ ...నువ్వు రాసిన 'అపకీర్తి పుం జాలు'కథ ప్రచురణకి తీసుకున్నారట. 'కోవెల' మాస పత్రికనుండి ఇంటిమేషన్ వచ్చింది".

"ఓరే అన్నయ్యా! యిలాంటి సందర్భాల్లో నిన్ను లాకెళ్లి కాఫీ త్రాపేవాణ్ని. యిప్పుడు..."అన్నాను అదోలా నవ్వుతూ.

"ఈడియట్!! నువ్వు నా తమ్ముడవిరా!!!" అన్నాడు బలార్వ్.

* * *

"ఏమే సౌందర్యా! ఎప్పుడే నే కవిశేఖరుడితో నీ పెళ్లి?"

"వాడితోనా?! ఆ గుడ్డివెధవతోనా??"

"మరి...అతడి రచనల్ని నువ్వు రాస్తానని...."

"షటప్...అదంతా వట్టిస్టంటు! పేరున్న రచయిత గదాని ప్రేమించాను. గొప్పరచయిత భార్యగా అందరి చేతా మన్ననలు పొందాలనుకున్నాను. యింకా నయం; పెళ్లయ్యాక కళ్లు పోలేదు...అందుకేగా వదిలించు కున్నాను నాన్నపై నేరం మోపి...,స్వప్నా...నేనో గొప్ప రచయితకి భార్యని కావాలి. 'గుడ్డి' రచయితక్కాదు..."

కాఫీగ్లాసు పగిలి పోతుందా అన్నంత గట్టిగా నా వ్రేళ్లు బిగుసుకున్నాయి. నాపక్కన ఫామిలీ రూమ్‌నుండి వినవచ్చిన ఆమాటలు — వినగానే. బలరామ్ అన్నయ్య చెయ్యి నాపిడికిలిని ప్రేమతో విడదీసింది.

"అవునన్నయ్యా! ఆమె అన్నదాంట్లో తప్పేమీ లేదు. నేను — నిజంగా గుడ్డివాణ్నేకదా!"

ఆరాత్రి నేను డిక్టేట్ చేస్తోండగా అన్నయ్యే వ్రాశాడు. పోస్టు చేసింది మాత్రం నేనే!

మరోరోజు అందుకొని చదువుకుంటుంది సౌందర్య.

"...నిన్నిన్నాళ్లూ సౌందర్యగా తల్చుకొని మురిసి పోయాను.నిజానికి నువ్వు హంతకురాలికంటే దుర్మార్గు రాలివి. ఎందుకంటే నువ్వు మనసుని హత్య చేశావు.

నాకళ్లు పోలేదు. మా బలరామ్ అన్నయ్య ఆడించిన నాటకం. జీవితంలో అనురాగం రచనలో అనురాగం లాంటిది కాదని, జీవితంలో ప్రేమ రచనల్లో ప్రేమ లాంటిది కాదనీ — ఈ చిన్ని పరీక్షకి నన్నొప్పించి — దేవుడిక్కూడ అనుమానం రాకుండా నన్ను నటింపజేసి — విజయం సాధించాడు.

నీ దృష్టిలో నాకు చూపుపోయింది. నాదృష్టిలో చూపొచ్చింది. *

